క్లుప్తంగా

సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ప్రజానీకానికి రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. చీకటి మీద వెలుగు, చెడు మీద మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి ప్రజల జీవితాల్లో కోటి ఆనందాల కాంతులు నింపాలని ఆకాంక్షించారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందేలా, ప్రజలు సుఖసంతోషాలతో జీవించేలా దీవించాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరి ముఖంలో చిరునవ్వును చూడాలనే తపనతో అనుక్షణం పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయం నెరవేరేలా ఆయనకు మరింత శక్తిని ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నారు. పర్యావరణహితంగా దీపావళి జరుపుకోవాలని కాలుష్య రహిత గ్రీన్ టపాసులనే కాల్చాలని ఆయన సూచించారు.

ప్రతి ఇంట్లో వెలుగులు నింపాలి

పటమట(విజయవాడతూర్పు): ఇంటింటా వెలుగులు చిమ్మే దీపావళి పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని విజయవాడ నగర ప్రజలకు మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఓ ప్రకటనలో దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోని హరిత బాణసంచా కాల్చాలని, వాతావరణాన్ని కాపాడాలని, కాలుష్యరహితంగా పర్వదినాన్ని జరుపుకోవాలని సూచించారు. టపాసులు కాల్చే సమయంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, ఆనందంగా, సంతోషకరంగా దీపావళి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

డొంక రోడ్డులో కల్వర్టు మరమ్మతులు ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల 32వ డివిజన్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డొంక రోడ్డులో కల్వర్టులు డౌన్ అయిపోవడంతో డ్రైయిన్ వాటర్ నిలిచిపోయి దుర్వాసన వచ్చి ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం ఎమ్మెల్యే మల్లాది విష్ణు దృష్టికి వచ్చింది. దీంతో ఆయన అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన అధికారులు డొంక రోడ్డులో డౌన్ అయిన కల్వర్టుల మరమ్మతుల పనులు ప్రారంభించారు. తమ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. మరమ్మతుల పనులను వైఎస్సార్ సీపీ డివిజన్ ఇంఛార్జి గుండే సుందర్‌పాల్ పర్యవేక్షించారు.

ఏపీపీలు, ఏజీపీల నియామకం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): విజయవాడలోని కోర్టు సముదాయంలో సుదీర్ఘ కాలంగా విధులు నిర్వర్తిస్తున్న పలువురు న్యాయవాదులకు ఏపీపీలు, ఏజీపీలుగా నియమిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిలో జంగా జయలక్ష్మిని 3వ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, గుజ్జర్ల భాస్కరరావును 12వ కోర్టు ఆడిషనల్ ప్రాసిక్యూటర్‌గా, దాసరి ఆంజనేయ ప్రసాద్‌ను సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఏజీపీ(అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్)గా, షేక్ ఖాదర్‌వలీని ఎల్ఎల్ఆర్‌పి కోర్టులో గవర్నమెంట్ ప్లీడర్‌గా పదోన్నతులు పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు పదోన్నతులు రావటంలో కృషి చేసిన ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు సాయిరాం, జోనల్ ఇన్‌చార్జి ఒగ్గు గవాస్కర్, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ సభ్యులు న్యాయవాదులకు అభినందనలు తెలిపారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై విజయవాడకు చెందిన గుర్మిత, చార్వి, వాహిని, సాహితి, ఆర్షిత, నిరుపమశ్రీ, లిఖిత, సూర్య, హారిక, అవంతికలు పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన నృత్య ప్రదర్శన భక్తులకు ఎంతో ఆకట్టుకుంది. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

డిసెంబర్ నాటికి ఆర్‌యూబీ పనులు పూర్తి

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- సీఎం వైఎస్ జగన్ చేతులమీదుగా ప్రారంభోత్సవానికి సన్నాహాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ ఆర్‌యూబీ పనులను డిసెంబర్ మొదటి వారంలోపు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఏపీ ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదేశించారు. మధురానగర్ ఆర్‌యూబీ పనులను స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్‌యూబీ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐదు డివిజన్ వాసుల ఆకాంక్షల మేరకు ప్రజల సౌకర్యార్థం తాము మధురానగర్ ఆర్‌యూబీ పనులను చేపట్టడం జరిగిందన్నారు. అయితే కొన్ని సాంకేతిక సమస్యలు, కోవిడ్ వల్ల పనులు నిర్దేశించిన సమయానికి పూర్తి చేయలేకపోవడం జరిగిందని పేర్కొన్నారు. ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా రాకపోకలకు వీలుగా



మధురానగర్ ఆర్‌యూబీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సర్వీసు రోడ్డును ఏర్పాటు చేశామన్నారు. అలాగే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఆర్‌యూబీకి అవసరమైన నిధులను మంజూరు చేసి పనులు వేగవంతం చేశామని వెల్లడించారు. డిసెంబర్ మొదటివారంలోపు పనులు పూర్తిచేసి సీఎం జగన్ చేతులమీదుగా ప్రారంభోత్సవం చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. మధురానగర్ ప్రజల చిరకాల కోరికగా ఉన్న ఆర్‌యూబీతో పాటు, కమ్యూనిటీ హాల్, కర్మల భవనం పనులు



కొనసాగుతున్న ఆర్‌యూబీ నిర్మాణ పనులు

తాము పూర్తి చేశామని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన డివిజన్‌ను మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని చెప్పారు. పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారని పనులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, నగరపాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సినీనటుడు చంద్రమోహన్ మృతికి సంతాపం

- నగరంతో ఆయనకు ప్రత్యేక అనుబంధం
- సాంస్కృతిక సంస్థల నీరాజనం

విజయవాడ కల్చరల్: సీనియర్ నటుడు చంద్రమోహన్(మల్లంపల్లి చంద్రశేఖరరావు(81)) హైదరాబాద్‌లో శనివారం ఉదయం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. 1942 మే 23వ తేదీన కృష్ణాజిల్లా పమిడిముక్కల గ్రామంలో జన్మించారు. సినీ రంగ ప్రవేశం జరిగాక పలు సందర్భాల్లో విజయవాడ వచ్చారు. ఇక్కడే చాలామంది ఆయనకు మిత్రులు, సన్నిహితులున్నారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. శుభోదయం సినిమా షూటింగ్ విజయవాడలోనే కొంత భాగం జరిగింది. గాంధీనగర్‌లోని బాబాయ్ హోటల్ ఇడ్లీ అంటే చంద్రమోహన్‌కు చాలా ఇష్టమని, ఇక్కడకు వస్తే కచ్చితంగా అక్కడే ఇడ్లీ తినేవారు.

మహానటి సావిత్రి స్మారక పురస్కారం

మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ 2019వ సంవత్సరంలో చంద్రమోహన్‌ను మహానటి సావిత్రి పురస్కారానికి ఎంపిక చేశాం. అనారోగ్య కారణాలతో ఆయన రాలేక పోవడంతో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పురస్కారాన్ని అందజేశాం. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ 2008వ సంవత్సరంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగిన వార్షికోత్సవంలో పురస్కారం అందించామని కార్యదర్శి బి.ఆంజనేయరాజు, అధ్యక్షుడు కొల్లూరి తెలిపారు.

సాంస్కృతిక కళా సంస్థల సంతాపం

చంద్రమోహన్ మృతికి నగరానికి చెందిన సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు(తెలుగు కళావాహిని,) శింగంశెట్టి చంద్రశేఖర్(శ్రీ



మహానటి సావిత్రి స్మారక పురస్కారం అందజేస్తున్న విజయలక్ష్మి, ప్రభల శ్రీనివాస్(ఫైల్)

కళాభారతి), కొప్పరపు బలరామకృష్ణమూర్తి(ఆర్టిస్ట్ అసోసియేషన్), గోళ్ల నారాయణరావు(ప్రోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం), బోడి ఆంజనేయరాజు (సాంస్కృతిక కళాసంస్థల ఐక్యవేదిక అధ్యక్షుడు) అభిరుచి అధ్యక్షుడు పులిపాక కృష్ణాజీ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

చంద్రమోహన్ మా కుటుంబ సభ్యుడు

సినీనటుడు చంద్రమోహన్ మా కుటుంబ సభ్యుడు, మద్రాస్‌లో, హైదరాబాద్‌లో ఉన్న సమయాల్లో తరచుగా కలిసే వాళ్లం. దర్శకుడు కె.విశ్వనాథ్ దర్శకత్వం వహించిన శుభోదయ సినిమాలో కలిసి నటించాను. ఫిలిం చాంబర్ హాల్‌లో షూటింగ్ జరిగింది. ఆయన మృతి బాధాకరం. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి.

– డాక్టర్ ఎంసీ దాస్, విద్యావేత్త

ఘనంగా సత్కరించాం..

మా రమణ కల్చరల్ ఆర్ట్స్‌కు చంద్రమోహన్ గౌరవ అధ్యక్షుడు. 2013వ సంవత్సరంలో ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో ఘనంగా సత్కరించాం. 2014వ సంవత్సరంలో సినీ నటి రాజశ్రీ, గీతాంజలిలతో కలిసి చంద్రమోహన్ ఇక్కడకు వచ్చారు. కళా సంస్థల ఆధ్వర్యంలో వారిని ఘనంగా సత్కరించాం. – **ఎం.రమణ**

'ఉర్దూ టీచర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా'

పటమట(విజయవాడతూర్పు): ఉర్దూ ఉపాధ్యాయుల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కృష్ణా, గుంటూరు జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి అన్నారు. డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ రీ ఆర్గనైజ్డ్ టీచర్స్ యూనియన్ ఆంధ్రప్రదేశ్, ఉపాధ్యాయ సేవాదళ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ 135వ జయంతి వేడుకలు, జాతీయ విద్యా దినోత్సవం, ఉర్దూ విద్యా సదస్సును పటమటలోని డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర కార్యాలయంలో జరిగాయి.

పురస్కారాల ప్రదానం

ఆజాద్ చిత్రపటానికి ఎమ్మెల్సీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయులకు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ పురస్కారాలు ప్రదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తీసుకువచ్చి, ప్రతి పేద విద్యార్థికి విద్యను అందించాలనే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

లక్ష్యంతో విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా డీఈవో తాహెరా సుల్తానా, డీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను, ఎండీ సదాతుల్లా ఉర్దూ(డీఐ), డీపీఆర్టీయూ కృష్ణ జిల్లా అధ్యక్షుడు జీవీఎస్ పెరుమాళ్లు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు బందనాదం కుమార్ రాజు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు మర్రి ప్రభాకర్, రూటా అధ్యక్షులు ఎంఎస్ ఇమామ్ బాషా, వెంకటరెడ్డి, జోజయ్య, సుబ్రహ్మణ్యం, అక్బర్ బాషా, ఇర్ఫాన్ పాషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బెంజిసర్కిల్‌లో కాకాని విగ్రహం ఏర్పాటుకు కృషి

లబ్బీపేట(విజయవాడతూర్పు): స్వాతంత్ర్య సమర యోధుడు, జై ఆంధ్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించి ఉక్కు కాకానిగా పేరుగాంచిన మాజీ మంత్రి కాకాని వెంకటరత్నం విగ్రహాన్ని బెంజిసర్కిల్‌లో ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. ఇటీవల విగ్రహ ఏర్పాటు అంశంపై నగరపాలకసంస్థ కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. అందుకు కృషి చేసిన దేవినేని అవినాష్‌ను శనివారం కాకాని ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో జరిగిన కార్యక్రమంలో దేవినేని అవినాష్ మాట్లాడారు. కాకాని వెంకటరత్నం విగ్రహాన్ని విజయవాడ నగరంలో తిరిగి ఏర్పాటు చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే అందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుకు ఆదేశాలు ఇచ్చారన్నారు. దీనికి అనుగుణంగానే ఇటీవల జరిగిన నగరపాలకసంస్థ



దేవినేని అవినాష్‌కు కాకాని జ్ఞాపికను అందిస్తున్న తరుణ్ కాకాని, విజయ్‌కుమార్ తదితరులు

కౌన్సిల్ సమావేశంలో విగ్రహ ఏర్పాటుకు తీర్మానించారని చెప్పారు. విగ్రహ ఏర్పాటుకు దేవినేని అవినాష్ చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ, డిసెంబరు 25 లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కాకాని ఆశయ సాధన సమితి సభ్యులు కోరారు. కాకాని ఆశయ సాధన సమితి ప్రెసిడెంట్ కాకాని తరుణ్, కాకాని విజయకుమార్, వెంకటేశ్వరరావు, కోనేరు బసవేశ్వరరావు, చంద్రశేఖర్, గుమ్మడి రామకృష్ణ, రామ్మోహన్, అవదానుల హరి, మేడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిపై దుష్ప్రచారం తగదు

వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెహబూబ్ షేక్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్పత్రిలో నెలలు నిండకుండా పుట్టిన(ప్రీ మెచ్యూర్ బేబీ) శిశువులు మరణిస్తే టీడీపీ, కమ్యూనిస్ట్ నాయకులు అక్కడకు వెళ్లి ఆస్పత్రిపై దుష్ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్ అన్నారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ.. నవజాత శిశు వైద్యంపై ఏ మాత్రం అవగాహన లేని వాళ్లు అక్కడకు వెళ్లి రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. అంతేకాకుండా శిశువులు చికిత్స పొందుతున్న చోటకు సైతం టీడీపీ మహిళలు వెళ్లారని, అక్కడ చికిత్స పొందుతున్న ఇతర శిశువులకు ఏదైనా ఇన్‌ఫెక్షన్ సోకితే వాళ్లు బాధ్యత వహిస్తారా అని ఆయన ప్రశ్నించారు. నవజాత శిశు వైద్యం అంటే రూ.లక్షల్లో కూడుకున్న



దన్న విషయం గ్రహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ విషయాన్ని గ్రహించి నవజాత శిశు వైద్య విభాగాన్ని 40 బెడ్స్ నుంచి 80 బెడ్స్‌కు పెంచడమే కాకుండా, అత్యాధునిక వైద్య పరికరాలను సమకూర్చిందని తెలిపారు. ఇక్కడ నాణ్యమైన వైద్యం అందుతుందని గ్రహించి ఎన్టీఆర్, కృష్ణా, పశ్చిమగోదావరి, ఏలూరు, గుంటూరు జిల్లాలనుంచి ప్రతి రోజు పెద్ద సంఖ్యలో నవజాత శిశువులను తీసుకు వస్తున్నారన్నారు. అంతేకాకుండా ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రవసం అయిన వారు కూడా శిశువులకు వైద్యం కోసం ఇక్కడకు తీసుకు వస్తున్న విషయాన్ని ఆందోళన చేసిన వారు గుర్తించాలన్నారు. శిశువులు మరణించడం బాధాకరమైన విషయమే అయినప్పటికీ, అందుకు కారణాలు తెలుసుకోవాలే కానీ, ఆస్పత్రిపై బురద జల్లే ప్రయత్నం చేయడం తగదని హితవు పలికారు.

సమాజాభివృద్ధిలో మహిళలు భాగస్వాములు కావాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): సమాజాభివృద్ధిలో మహిళలు భాగస్వామ్యం కావాలని ప్రముఖ రచయిత, కవి గుమ్మా సాంబశివరావు అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో టైలరింగ్, ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్, కంప్యూటర్ శిక్షణ పొందుతున్న మహిళలకు శనివారం రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సంస్కరణ ఉద్యమాలు–మహిళలు అనే అంశంపై సభ జరిగింది. సాంబశివరావు మాట్లాడుతూ తరతరాల నుంచి మహిళలకు సతీసహగమనం, బాల్య వివాహాలు, వితంతు పునర్వివాహాలు, జోగినీ వ్యవస్థ, ఓటు హక్కు, విద్యా, ఉద్యోగాలు, అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా రాజా రామ్మోహన్‌రాయ్, గురజాడ, వీరేశలింగం, జాషువా, జ్యోతిబాపూలే, హేమలతా లవణం, ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్ వంటి సంఘ సంస్కర్తలు మహిళల హక్కుల కోసం నడిపిన ఉద్యమాలు, మహిళా కోణంలో రచించిన రచనలను ఉత్తేజకరంగా వివరించారు. కార్యక్రమంలో ఎం.బి.విజ్ఞాన కేంద్రం బాధ్యులు స్వరూపరాణి, పి.విజయ, స్టెప్ ఎ హెడ్ ఫర్ ఈక్వాలిటీ అధ్యక్షులు జ్యోత్స్న పాల్గొన్నారు.

శివకామేశ్వరీ పీఠంలో మాసశివరాత్రి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో మాసశివరాత్రి పురస్కరించుకుని శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన ప్రత్యేక పూజ లు అభిషేకాలు శనివారం జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి పంచామృత అభిషేకం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమ సుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వివాహిత అదృశ్యంపై ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పగిడాకుల ఆదిమ్మ కంచికచర్ల మండలం, గొట్టిముక్కల గ్రామంలో కూతురు సుంకర కృష్ణవేణి, అల్లుడు రాజేష్‌తో కలిసి నివాసముంటున్నారు. విజయవాడలో జరుగుతున్న సినిమా షూటింగ్‌లో రోజువారి కూలిగా పని చేసేందుకు ఈ నెల 10న కూతురు, అల్లుడుతో కలిసి ఆమె నగరంలోని గాంధీనగర్‌కు వచ్చి షూటింగ్‌లో పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటికి వెళ్లేందుకు కూతురు సుంకర కృష్ణవేణిని పిలువగా, షూటింగ్‌లో పాల్గొనేందుకు విజయవాడ రూరల్‌లోని పాతపాడు నుంచి వచ్చిన తన అత్త ఇంద్రావతితో కలిసి వెళ్తానని చెప్పడంతో ఆమె తల్లి వెళ్లిపోయింది. అత్తతో కలిసి ఆటోలో వెళ్తున్న కృష్ణవేణి ముత్యాలంపాడులోని శివాలయం వద్ద ఆటో దిగి మరో ఆటో ఎక్కి వెళ్లిపోయింది. దీంతో జరిగిన విషయాన్ని ఆమె తల్లికి తెలిపింది. కృష్ణవేణి బంధువులు, తెలిసిన వారి వద్ద వాకాబు చేసినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శనివారం సాయంత్రం ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

పాయకాపురం(విజయవాడ రూరల్): కండ్రికలో అబ్దుల్ సలాం(29) అనే వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందిన సంఘటనపై అనుమానాస్పద మృతిగా శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు, మృతుడు సలాం డీజే బాక్సులు రిపేరు చేస్తుంటాడు. అతనికి భార్య, 9 నెలల బాబు వున్నాడు. భార్యభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా మృతుని భార్య కొంత కాలంగా పుట్టింట్లోనే ఉంటోంది. అప్పటి నుంచి సలాం కండ్రికలో తల్లితోనే వుంటున్నాడు. శనివారం తల్లి సలీమ్ పనికి వెళ్ళిన తర్వాత సలాం వంటగదిలో చీరతో ఫ్యాన్‌కి ఉరి వేసుకున్నాడు. పక్కింటి వారు ఇచ్చిన సమాచారంతో తల్లి ఇంటికి వచ్చి చూడగా సలాం అప్పటికే మృతిచెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

దాసాంజనేయుడికి సిందూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సుప్రసిద్ధ మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు శనివారం జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. వాహన చోద కులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి ఛైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

మాల మహానాడు నేతల ధర్నా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తెలంగాణ ఎన్నికల్లో రాజకీయ లబ్ధిపొందాలనే కుట్రతోనే ప్రధాని నరేంద్ర మోదీ మాదిగల విశ్వరూప మహాసభ చేపట్టారని, ఇది ఎస్సీల్లో ఒక వర్గానికి కొమ్ముకాయడమేనని పి.వి.రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పందు అశోక్‌కుమార్ అన్నారు. విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ నందు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శనివారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించకుంటే తెలుగు రాష్ట్రాల్లోని బీజేపీ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు పెయ్యల పరశురాముడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు గుమ్మాపు సూర్యవరప్రసాద్, లక్ష్మల నరసింహారావు, శీలం స్వరూపారాణి, సురేష్, సామా బాబురావు, నాయకులు పాల్గొన్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విజయవాడకల్చరల్: గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం ఆధ్వర్యంలో 14వ తేదీ మంగళవారం నుంచి వారం రోజుల పాటు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు శనివారం తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. 14వ తేదీ సాయంత్రం ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం సంచాలకుడు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ ప్రారంభిస్తారన్నారు. 15న డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ తెలుగు పద్యనాటక వైభవం అంశంగా ప్రసంగం, 16న తెలుగు వాగ్గేయకారులు అంశంగా డాక్టర్ భూసురపల్లి వేంకటేశ్వర్లు, 17న శ్రీరమణ హాస్యరచనలు అంశంగా కొప్పర్తి రమణ, 18న డాక్టర్ గుమ్మా సాంబశివరావు అవంత్స సోమసుందర్ సాహితీజీవన రేఖలు అంశంగా ప్రసంగిస్తారన్నారు. 19న జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా చైతన్యం ఏది, ఎక్కడ అంశంగా ప్రసంగం, 20న ముగింపు సభలో తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి పాల్గొంటారని తెలిపారు. బ్రోచర్‌ను గ్రంథాలయ సాంస్కృతిక విభాగం నిర్వాహకుడు బెల్లపు బాబ్జీ, కార్యదర్శి నీలం దుర్గారావు ఆవిష్కరించారు.

14 నుంచి కేబీఎన్‌లో..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాకరపర్తి భావనారాయణ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ సైన్సెస్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు గ్రంథాలయ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 14వ తేదీన జరిగే ప్రారంభోత్సవ సభకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవాలను ప్రారంభిస్తారన్నారు. అదే రోజు కేబీఎన్ కళాశాల ఇంటర్మీడియెట్ విద్యార్థులకు స్పెల్‌బీ, వక్తృత్వం



హనుమంతరాయ గ్రంథాలయంలో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పోటీలు జరుగుతాయని చెప్పారు. 15న నగరంలోని విద్యాసంస్థలకు చెందిన ఎనిమిది, తొమ్మిది, పది తరగతులకు చెందిన విద్యార్థులకు స్పెల్‌బీ, పోస్టర్ ప్రెజంటేషన్, ఏకపాత్రాభినయం(మై బుక్.. మై లైఫ్) క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 16న నగరంలోని కళాశాలల చెందిన డిగ్రీ విద్యార్థులకు ట్రెడిషనల్ డ్రస్ పోటీలు, ఏ బుక్ ఇన్‌స్పైర్ మి, వక్తృత్వం, క్విజ్ పోటీలు, 17న కేబీఎన్ కళాశాల డిగ్రీ, పీజీ విద్యార్థులకు పుస్తక పరిచయం, ట్రెడిషనల్ డ్రస్, వక్తృత్వం, క్విజ్ పోటీలు జరుగుతాయన్నారు. 18వ తేదీన ముగింపు సభలో బహుమతి ప్రధానోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. పోటీలకు సంబంధించిన వివరాలకు 96766 85698 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రామకృష్ణాపురంలో ....

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు రామకృష్ణాపురంలో కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ, శ్రీ కళ్ళేపల్లి శేషంరాజు స్మారక శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి ఎస్.కళ్యాణినాగలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ఘనంగా ఆజాద్ జయంతి

పాయకాపురం(విజయవాడరూరల్): దేశంలో విద్యాభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎంతో కృషి చేశారని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా పేర్కొన్నారు. 61వ డివిజన్‌లో అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగుల్‌మీరా ముందుగా ఆజాద్ చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేసిన తొలి బాటసారి అబుల్ కలామ్ ఆజాద్ అని, గుణాత్మక విద్యకు మార్గదర్శి గొప్ప విజనరీ పర్సన్ అని కొనియాడారు. నిజాయితీకి నిలువెత్తు ప్రతిరూమని, తొలి ఐఐటీ వ్యవస్థాపకుడు ఆజాద్ అని ఇలాంటి నాయకులను ఆదర్శంగా తీసుకొని ఆయన పేరిట ఆజాద్ ముస్లిం కమిటీని స్థాపించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మజూరే ఖుదా ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బషీర్, ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్‌అలీ, రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్‌మౌలాలి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి షేక్ హుస్సేన్, సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్, కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ సమీనా ఫాతిమా, కోశాధికారి షేక్ రఫీ, సభ్యులు సోహెబ్, నగర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ మస్తాన్‌వలీ, డివిజన్ మహిళా అధ్యక్షురాలు ఎండీ షబానా, కార్యదర్శి ఎండీ రఫీ, మసీదు పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆజాద్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న షేక్ నాగుల్‌మీరా తదితరులు

ఆజాద్ జయంతికి తరలి వెళ్ళిన ముస్లిం సోదరులు

పాయకాపురం(విజయవాడరూరల్): నగరంలో ఏర్పాటు చేసిన మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలకు పలు డివిజన్ల నుంచి ముస్లిం సోదరులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్ళారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి జననేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావడంతో ముస్లిం సోదరసోదరీమణులు ఆనందోత్సాహంతో వెళ్ళారు. 62వ డివిజన్ నుంచి పార్టీ నాయకులు షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో వెళ్ళారు.



62వ డివిజన్ నుంచి వెళ్తున్న ముస్లిం సోదరులు, పార్టీ నాయకులు

ఉత్సాహంగా శ్రీమతి అమరావతి





గుణదల(విజయవాడతూర్పు): మహిళలు అన్ని రంగాల్లో విజయం సాధించాలని వర్ధమాన నటి, హీరోయిన్ ఈషా చావ్లా అన్నారు. భారతీనగర్‌లోని నోవోటెల్ హోటల్‌లో శనివారం సాయంత్రం శ్రీమతి అమరావతి పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మహిళలు వృత్తి, వ్యాపార ఉద్యోగాలలో ప్రత్యేక గుర్తింపు సాధిస్తున్నారని తెలిపారు. ఇంటి బాధ్యతలు నిర్వహించడంలో సమర్థతను చాటుకునే మహిళలు శ్రీమతి అమరావతి కార్యక్రమంలో పాల్గొనటం హర్షణీయమన్నారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణతో ఆహుతులను అలరించారు. నిర్వాహకులు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బుల్లితెర తారలు సందడి చేశారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ నిర్మాత అంబికా కృష్ణ, ఎస్ఎల్‌వీ గ్రూప్ అధినేత శ్రీనివాసరాజు, పలువురు సెలబ్రిటీస్ పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు చిత్రలేఖనం పోటీలు దోహదపడతాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ జమల పూర్ణమ్మ అన్నారు. విజయవాడ ఆర్ట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు శనివారం నిర్వహించారు. పోటీల్లో నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయంలో నిర్వహించే కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు విజయవాడ ఆర్ట్



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సొసైటీ తరపున మెరిట్ సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు కొలుసు సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి ఎం.వేణుగోపాల్ రావు, గ్రంథాలయ అధికారి కే రమాదేవి, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.